
- అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రూ.4,500 కోట్లు కేటాయింపు..ఉమ్మడి జిల్లాలో 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా **రూ.908 కోట్ల** లబ్ధి
- తల్లికి వందనం పథకం నిధుల కేటాయింపునకు ఓకే.. ఒకటి నుంచి ఇంటర్ వరకు జిల్లాలో 16.51 లక్షల మంది తల్లులకు ప్రయోజనం. లబ్దిదారులకు రూ.15 వేల చొప్పున జిల్లా అంతటికి **రూ.2,476 కోట్ల** వరకు నిధుల అవసరం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సైతం త్వరలో అమలు చేస్తామని ప్రకటన.. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో **19 లక్షల మంది** వరకు ప్రయోజనం



సూపర్.. బడ్జెట్

కూటమి 'పద్దు' పాడుపు





కాకినాడ/రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పయ్యావుల పద్దు సంక్షేమ మంత్రం జపించింది.బడ్జెట్‌లో ఎన్నికల హామీల అమలుకు పెద్దపీట వేస్తూ ముందుకు కదిలింది. మహిళలు, అన్నదాతల మేలే అసలు సిసలు ప్రాధాన్యంగా భావించి వరాల జల్లు కురిపించింది. ఎప్పుడెప్పుడా అని సూపర్‌సిక్స్ హామీల అమలుకు ఎదురుచూస్తోన్న లబ్ధిదారులకు తీపికబురు అందించింది. గత వైసీపీ ప్రభుత్వం అలవిమాలిన అప్పులతో ఖజానాను గుల్ల చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించినా.. ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబడుతూ ఇచ్చిన హామీల అమలుకు నిధుల విదిలింపుతో తమది చేతల ప్రభుత్వమని విత్తమంత్రి చూపించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళల ఉచితబస్సు ప్రయాణానికి త్వరలో శ్రీకారం చుడుతున్నామని ప్రకటించి పేద, మధ్య తరగతి వర్గాలను ఉత్సాహపరిచారు. వ్యవసాయానికి తూట్లు పొడిచి అన్న దాతల సిరిని అటకెక్కించిన గత వైసీపీ ప్రభుత్వ పాతకానికి చరమగీతం పాడుతూ తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకానికి బడ్జెట్‌లో ఊపిరిపోశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి రాష్ట్రబడ్జెట్ సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా వికసించింది. బడ్జెట్ ప్రకటన మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క అన్నదాత సుఖీభవ పథకం అమలుకే రాష్ట్రప్రభుత్వం 4.54 లక్షల మంది రైతులకు రూ.908 కోట్ల లబ్ధి జరగనుంది.

అన్నదాతలకు ఆనందం..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని మేనిఫెస్టోలో ప్రకటించింది. ఇందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం దగాతో మోసపోయిన అన్నదాతలను ఆదుకుంటామని ప్రకటించింది. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.4,500 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది అన్నదాతలకు రూ.370 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. సున్నా వడ్డీ రుణాలకు బడ్జెట్‌లో రూ.628 కోట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 3.01 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఇందులో ఒక్క కాకినాడ జిల్లాలో 96,383మంది అన్నదాతలకు మేలు జరగనుంది. వీరంతా రూ.22 కోట్ల వరకు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. అన్నదాతలకు అండగా నిలబడేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అమలు చేసింది. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా రైతులకు బోర్లు కొట్టించింది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకానికి ఊపిరిపోసింది. రూ.50 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. దీంతో తిరిగి అన్నదాతలకు మంచి రోజులు వచ్చినట్లయింది.

తల్లికి వందనమే..

బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల ప్రకటించారు.దీంతో లక్షల మంది పేద, మధ్య తరగతి తల్లుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఎన్నికలకు ముందు టీడీపీ ఈ పథకాన్ని ప్రకటించింది. తాము అధికారంలోకి రాగానే తల్లికి వందనం కింద ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు పిల్లలను బడులకు పంపే తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రాధాన్యం కల్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి వారి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఇందుకు ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15 వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధుల అవసరం.ఇందులో ఒక్క కాకినాడ జిల్లా చూసుకుంటే 6.20 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం కలగనుంది. ఒక్క కాకినాడ జిల్లాకు చూస్తే ఆర్థిక భారం రూ.930కోట్ల వరకు ఉంది.

ప్రకృతి సాగుకు పండగే..

ఉమ్మడి జిల్లాలో ఏటా ప్రకృతిసాగు విస్తీర్ణం పెరుగుతోంది.ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి రూ.422 కోట్లు కేటాయించింది. దీంతో ఈ విధానం కింద సాగుచేసే రైతులకు ఆర్థిక సహకారం అందనుంది. ఉమ్మడి జిల్లాలో వరి, ఇతర వాణిజ్య పంటలు దాదాపు పదివేల ఎకరాల్లో ప్రకృతి సాగు కింద ఉన్నాయి. కాకినాడ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, దీనికి మరింత కట్టుబడి ఉంటామని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రక టించింది. దీంతో స్మార్ట్‌సిటీకి మరింత ఆర్థిక దన్ను లభించనుంది. రూ.50 వేల నుంచి 99,999 మంది జనాభా ఉన్న రెండో తరగతి పట్టణాల్లో జీఐఎస్ ఆధారిత బృహత్తర ప్ర ణాళికల రూప కల్పన చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మండపేట, రామచంద్రపురం,పిఠాపురం తది తర పట్టణాలకు మహర్దశ పట్ట నుంది.ఈ ప్రణాళికతో పట్టణాల్లో ప్రజల జీవన విధానం, భవిష్యత్తులో పెరగబోయే ట్రాఫిక్‌కు పరిష్కారం, భవిష్యత్తు అభివృద్ధిపై ప్రణాళికలతో మరింత మెరుగుపడనున్నాయి.

- రాష్ట్ర బడ్జెట్‌లో వరాల జల్లు
- సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి
- సూపర్‌సిక్స్ హామీలకు పెద్దపీట
- మళ్లీ ఎన్టీఆర్ జలసిరి
- నగరాల అభివృద్ధి చర్యలు
- 'తూర్పు'లో ప్రత్యేక బెటాలియన్
- చింతలపూడికి ప్రాధాన్యం
- రహదారులు మార్చికి రెడీ

ఇక రైట్‌రైట్..

గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ ఛార్జీలను పెంచేసి పేదల నడ్డివిరగ్గొట్టింది. కొద్దిపాటి దూరానికే షాక్ కొట్టే ఛార్జీలు వసూలు చేసింది.బయట పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ నేపథ్యంలో ఇంటిని నడిపే ఇల్లాలి సంక్షేమం కోసం ఎన్నికలకు ముందు టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే జిల్లాలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలు చేస్తామని హామీఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు బడ్జెట్ ప్రసంగం సందర్భంగా మంత్రి పయ్యావుల ప్రకటించారు.ఈ పథకంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 25.52 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కిందకు రానున్నారు. వీరిలో ఒక్క కాకినాడ జిల్లాలో 9.50లక్షల మం దికి ప్రయోజనం జరగనుంది.

రహదారుల నిర్మాణం

రాజమహేంద్రవరంలో మరో ప్రత్యేక పోలీసు బెటాలియన్‌ను ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పరిధిలోని గోదావరిలో నిర్మిస్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అధిక ప్రాధాన్యత కల్పించారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీలకు ఇళ్ల నిర్మాణానికి ప్రధాని ఆవాజ్ యోజన పథకం కింద రూ.లక్షా 30 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.50వేలు ఇవ్వనుంది. దీంతో పేద, మధ్య తరగతి బీసీలకే సొంతిల్లు కట్టుకోవడానికి వెసులుబాటు దొరికినట్టు అయింది. మిగతా జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా తక్కువగా ఉంది.జిల్లాలో రహదారి పనులన్నీ 2025 మార్చినాటికి పూర్తి చేయనుంది.బీసీ సబ్ ప్లాన్‌కు ఏడాదికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేయనుంది. బీసీల స్వయం ఉపాధికి ప్రత్యేక పథకాలు తీసు కుని రానున్నట్టు ప్రకటించారు.అభివృద్ధిపరంగా రోడ్లు, డ్రెయిన్లు,భవనాలు నిర్మించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ముఖ్యమైన రోడ్లన్నీ వచ్చే మార్చిలోపు నిర్మించడానికి నిధులు కేటాయించారు. జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలన్నింటికీ డబుల్ లేన్ రోడ్ల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. గోదావరి జిల్లాలకు అన్నం పెట్టే ఇరిగేషన్ సిస్టమ్ అభివృద్ధికి భారీగానే నిధులు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు. తాము డెల్టా కాలువల అభివృద్ధితో పాటు గోదావరి ఏటిగట్లు, పొలాలు కోతలకు గురికాకుండా గ్రోయిన్ల నిర్మాణ ప్రతిపాదనలు పంపామని,ఈసారి భారీగా నిధులు కేటాయించనున్నట్టు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో వివరంగా కేటాయింపులొస్తాయన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా...

కాకినాడ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేటాయింపులు జరిగాయి. అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమ ప్రాధాన్యమిస్తూ నిధుల కేటాయింపు జరిగింది. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చింది.



-వనమాడి కొండబాబు,
కాకినాడ సిటీ ఎమ్మెల్యే

వ్యవసాయ రంగానికి పెద్దపీట

సర్పవరంజంక్షన్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉంది. రూ.43వేల కోట్లతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. రైతులకు వడ్డీలేని రుణాలు, భూసార పరీక్షలు, మట్టి నమూనా ల్యాబ్‌లతో సాగుకు ప్రోత్సాహం.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రజాకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేశారు.



-పంతం నానాజీ,
కాకినాడ రూరల్ ఎమ్మెల్యే

సంక్షేమం, అభివృద్ధికి సూచిక

తునిరూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌తో కూటమి ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చింది. బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యం చేశారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించేలా బడ్జెట్‌ను పొందుపరిచారు. అభివృద్ధి, సంక్షేమం దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపకల్పన చేయడం రాష్ట్రఅభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది.



-యనమల దివ్య,
తుని ఎమ్మెల్యే

సముచిత బడ్జెట్ అభినందనీయం

సామర్లకోట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలవారికి సమతూకంలో అభివృద్ధి, సంక్షేమం అమలుకు కూటమి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అభినందనీయం. గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధికి అత్యధికంగా రూ.16,739కోట్లు కేటాయించడంతో పంచాయతీలుఅభివృద్ధి చెందుతాయి. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సారథ్యంలో అన్నిశాఖలకు నిధుల కేటాయింపుద్వారా నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టారు.



-నిమ్మకాయల చినరాజప్ప,
పెద్దాపురం ఎమ్మెల్యే

అభివృద్ధి, సంక్షేమానికి వారధిగా..

ప్రత్తిపాడు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ అభి వృద్ధి సంక్షేమానికి వారధిగా ఉంది. వ్యవసాయ రంగానికి రూ.47వేలకోట్లు, బీసీల సంక్షేమానికి రూ.39,007కోట్లు కేటాయించడం.. ఇందుకు అభివృద్ధికి సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు అర్థమవుతోంది. పంచాయతీరాజ్, రహదారులు, శిశు సంక్షేమం తదితర రంగాలకు కూడా బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇవ్వడం అభివృద్ధికి సంకేతం.



-వరుపుల సత్యప్రభ రాజా,
ప్రత్తిపాడు ఎమ్మెల్యే

అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది

జగ్గంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది. వ్యవసాయం, నీటి పారుదలశాఖకు పెద్దపీట వేయడంతో రాష్ట్రానికి వెన్నెముకైన రైతులకు ఉపయోగపడుతుంది. వేల ఎకరాలకు నీరు అందుతుంది. సంక్షేమం,అభివృద్ధి సమపాళ్లలో నడుస్తున్నాయి.



-జ్యోతుల నెహ్రూ,
జగ్గంపేట ఎమ్మెల్యే

జగ్గంపేటలో మట్కా కింగ్!



జగ్గంపేటలో అభివాదం చేస్తున్న సినీ హీరో వరుణ్‌తేజ్

సినీ నటుడు వరుణ్‌తేజ్ సోమవారం జగ్గంపేటలో సందడి చేశారు. మట్కా సినిమా ప్రమోషన్‌లో భాగంగా వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళ్లే దారిలో జగ్గంపేట జాతీయ రహదారిపై కాసేపు ఆగారు. ఆయనకు అభిమానులు ఘనస్వాగతం పలికారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడిగా, భారతదేశ తొలివిద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలకు గుర్తుగా ఆయన పుట్టినరోజును ప్రతి సంవత్సరం జాతీయ విద్యాదినోత్సవంగా, మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా దేశమొత్తం జరుపుకుంటున్నామన్నారు. స్వరాజ్య పోరాటంలో గాంధీజీతో కలిసి ఆయన అనేక ఉద్యమాల్లో పాల్గొనడంతోపాటు జైలుశిక్షను అనుభవించారన్నారు. హిందూ, ముస్లిం ఐక్యతకు కృషిచేశారని, మైనారిటీల విద్య, సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి సునీల్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, అడల్ట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి త్రిమూర్తులు, ముస్లిం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జవహర్‌అలీ పాల్గొన్నారు.



మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా చిన్నారులతో కలెక్టర్.. (ఇన్‌సెట్)లో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

పిఠాపురం పాదగయకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం రెండో సోమవారం దశమి కావడంతో పూజలు, స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులతో పాదగయ పరిసర రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. భక్తుల రాక తెల్లవారుజాము మూడు గంటలకు ప్రారంభమై రాత్రి వరకూ కొనసాగింది. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామికి పంచామృత మహన్యాస పూర్వక రుద్రాభిషేకంనిర్వహించారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉన్న మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. తులసి మొక్కలవద్ద దీపాలు వెలిగించారు. రాజరాజేశ్వరదేవి, పురుహూతికాఅమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.



పాదగయలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థి సస్పెన్షన్

కాకినాడ క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్యకళాశాల, మెన్స్ హాస్టల్‌లో ఆదివారం ర్యాగింగ్ కలకలం రేపిన విషయం తెలిసిందే. ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థిని ఏడాదిపాటు సస్పెండ్‌తోపాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ కళాశాల యాజమాన్యం సోమవారం చర్యలు తీసుకుంది. హౌస్‌సర్జన్ ఇంటర్న్‌షిప్ చేస్తున్న శ్రీకాకుళానికి చెందిన ఎస్.జగదీష్ ఆర్‌ఎంసీ మెన్స్ హాస్టల్‌లో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పదిమందిపై ఈనెల 9వతేదీ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో దాడికి పాల్పడడమే కాకుండా జూనియర్స్‌ను హాస్టల్ బయట నిలబెట్టడంతో బాధిత విద్యార్థులు ఆర్‌ఎంసీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఉదయం కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, సర్పవరం పోలీసులు కాకినాడ ఆర్డీవో మెన్స్ హాస్టల్‌కు చేరుకుని బాధిత విద్యార్థులను విచారించారు. అనంతరం కళాశాల యాజమాన్యం జగదీష్‌పై చర్యలు తీసుకుంది. ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడతామని మంగళవారం ర్యాగింగ్ నిషేధంపై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.

విమానాశ్రయానికి పంట భూములు వద్దని రైతుల వినతి

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విమానాశ్రయ నిర్మాణానికి పంట భూములు సేకరించవద్దని తొండంగి మండలంలోని బెండపూడి, పీఈ చిన్నాయిపాలెం రైతులు కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. ఈ మేరకు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. మూడు పంటలు పండించే భూములను సేకరించవద్దని విజ్ఞప్తి చేశారు. భూములు సేకరించడం వల్ల తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతివారం ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిచ్చి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ అంశాలపై 361అర్జీలు అందాయన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

వాహన డ్రైవర్ల వినూత్న నిరసన



నిక్కర్లు వేసుకుని మొలకు వేపకొమ్మలతో అర్ధనగ్న నిరసన తెలియజేస్తున్న డ్రైవర్లు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): క్లాప్ వాహనడ్రైవర్లు వినూత్నంగా తమ నిరసన తెలిపారు. మూడునెలల బకాయి జీతాల కోసం నిక్కర్లు వేసుకుని మొలకు వేపకొమ్మలు కట్టుకుని అర్ధనగ్నంగా ర్యాలీ చేశారు. కాకినాడ అర్బన్ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి, సీఐటీయూ కాకినాడ నగర కన్వీనర్ వెంకటరమణ మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్ల బకాయి జీతాలకోసం ఆందోళన చేపట్టి 18రోజులు అయినా నేటికీ వీరి సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చేయడంలేదన్నారు. ధర్నాలో సంతోష్, శివశంకర్, గంగాధర్ పాల్గొన్నారు.

స్వామియే.. శరణం అయ్యప్ప



కోటనందూరు మండలం బొద్దవరంలో అయ్యప్ప లక్ష పత్రి పూజ చేస్తున్న స్వాములు(ఫైల్)

- స్వామి మాలధారణ నియమ, నిబ్ధతతో ఆధ్యాత్మిక చింతన.. ఆరోగ్యానికి రక్షణ
- 41 రోజులపాటు కఠిన దీక్ష
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లక్షమంది స్వాములు
- అయ్యప్ప నామస్మరణతో మార్మోగుతున్న గ్రామాలు

కోటనందూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వామిశరణం.. అయ్యప్పశరణం అంటూ స్వాముల శరణుఘోషతో గ్రామాలు మార్మోగుతున్నాయి. స్వాముల మాలధారణతో ఆధ్యాత్మిక చింతన భావం పెరుగుతుంది. స్వామి దీక్ష మంచి ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తోంది. ఏటా అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో స్వాములు మాలధారణ చేస్తుంటారు. కార్తీకమాసం, ధనుర్మాసం రెండు నెలల్లో మండలి దీక్ష, మకర జ్యోతి దర్శనానికి వెళ్లే భక్తులతో శబరిమల కిటకిటలాడుతుంది. ఈ ఏడాది అధికసంఖ్యలో స్వాములు మాలధారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ఒక లక్షమంది స్వామి మాలధారణ చేపట్టారని గురుస్వాములు అంటున్నారు. గతేడాది కంటే ఈఏడాది గ్రామాల్లో సంఖ్య మరింత పెరిగిందని తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు

స్వామి మాలధారణ 41రోజులపాటు నియమనిష్టలతో ఆచరించే స్వాములు శారీరకంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటారు. ఎంతో సద్బుద్ధి కలిగి ఉంటారు. సత్ప్రవర్తన మంచి ఆలోచనకు తోడ్పాటునిస్తుంది. శాకాహారం తీసుకోవడం, చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ ఒక చోట ఉండి పూజలు చేస్తుంటారు. మాలధారణ చేసిన భక్తులు 41రోజులపాటు కఠోర దీక్ష చేస్తారు. అనంతరం గురుస్వాముల ద్వారా ఇరుముడిని కట్టి కేరళ రాష్ట్రంలో శబరిమలకు వెళ్లి ఇరుముడిని అయ్యప్పకు ఇస్తారు. అక్కడకు వెళ్లలేని స్వాములు ద్వారపూడిలో అందజేస్తారు. అయ్యప్పమాల ధారణతో ఆధ్యాత్మిక నెలకొల్పేలా చేస్తున్నారు.

మాలధారణతో ప్రయోజనాలెన్నో..

- ఉదయం, సాయంత్రం చల్లని నీటితో స్నానం చేయడంవల్ల శరీరంలో శక్తి, ఏకాగ్రత పెరుగుతుంది. శిర స్నానంతో రక్తపోటు తగ్గి మంచి ఆరోగ్యం చేకూరుతుంది.
- శీతాకాలం స్వాములు నల్లటి వస్త్రాలను ధరిస్తారు. నల్లటి వస్త్రాలు వెచ్చదనాన్ని ఇస్తాయి. చలికాలంలో ఇవి శరీరానికి ఉపకరిస్తాయి. స్వాములు శని ప్రభావానికి లోనుకాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని గురుస్వాములు అంటున్నారు.
- నుదుటన చందనం, విభూది, కుంకుమ పెట్టడంవల్ల చల్లదనంతోపాటు, మానసిక ప్రశాంతత కల్గుతుంది. కాళ్లకు చెప్పులు లేకపోవడంవల్ల నడిచేటప్పుడు చిన్నచిన్న రాళ్ల గువ్వలు తగిలి రక్తప్రసరణ బాగా అవుతుంది.
- శాకాహారంతో ఆరోగ్యకరంగా ఉండడంతోపాటు మంచి దినచర్య అలవడుతుంది.

ఆధ్యాత్మిక చింతన పెరుగుతోంది



స్వామి మాలధారణతో భక్తిభావం పెరిగి గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన నెలకొంటుంది. స్వామి మాలధారణతో మంచి ఆరోగ్యంతోపాటు ప్రశాంతత ఉంటుంది.

-సిద్దా నానాజీ, గురుస్వామి, గొల్లప్రోలు

● చెడు అలవాట్లకు దూరంగా...




స్వాములు మాలధారణవల్ల చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఆరోగ్యకరంగా మారి క్రమశక్షణగా ఉంటారు.

-అర్లి శ్రీనివాస్, గురుస్వామి, కాకరాపల్లి

ఊపిరిని పట్టే.. న్యుమోనియా!

మేలుకోకుంటే.. ప్రమాదమే!



- అప్రమత్తతోనే దూరం
- ఇది కొవిడ్ లాంటిదే..
- ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్
- నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం
- రోగనిరోధకశక్తి తక్కువైతే వ్యాప్తి
- కఫం, దగ్గు, ఆయాసం లక్షణాలు
- కొవిడ్ జాగ్రత్తలే మేలు
- నేడు ప్రపంచ న్యుమోనియా డే

జీజీహెచ్(కాకినాడ)/రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : న్యుమోనియా.. ఊపిరితిత్తుల్లో వచ్చే ఒక ఇన్‌ఫెక్షన్. దగ్గినప్పుడు, వైరస్‌ల ద్వారాను, బాక్టీరియా ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. సాధారణ భాషలో న్యుమోనియాను నెమ్ముగా వ్యవహరిస్తుంటారు.ఇది వచ్చిన రోగికి దగ్గు, కఫం, జ్వరం, ఆయాసం వంటివి వస్తుంటాయి. వివిధ రకాలైన పరీక్షల ద్వారా దీన్ని గుర్తించవచ్చు. నాన్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఇది రావొచ్చు. కొన్ని రకాల పడని వస్తువులు తిన్నా, పడని వాతావరణంలోకి వెళ్లినా ఇది వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. మంగళవారం ప్రపంచ న్యూమోనియా డే సందర్భంగా ప్రత్యేక కథనం..



ఈ లక్షణాలుంటే జాగ్రత్త

మనిషి రక్తంలో ఆక్సిజన్ స్థాయి పడిపోతే వెంటిలేటర్ వరకు వెళ్లే స్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే కఫం బాగా పడుతున్నా,చలికి బాగా వణుకుతున్నా, బాగా ఆయా సపడుతున్నా, దేహంలో ఎటువంటి తేడాలు కనిపించినా, వెంటనే పల్స్ ఆక్సీమీటర్‌పై పరీక్షించుకుని శాచురేషన్ 85 కంటే తక్కువగా ఉంటే వెం టనే వైద్యుడిని సంప్రదించాలి. అక్కడ చికిత్స ద్వారా ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.

గుర్తించడం ఎలా...

వైరల్ న్యూమోనియా సోకినపుడు ఎక్స్‌రేలో చిన్న చిన్న మచ్చలుగా కనిపిస్తాయి. ఇవి చిన్నగా ఉంటాయి కాబట్టి చాలా మంది సరిగా గుర్తించలేరు. అప్పుడు సీటీ స్కాన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అలా కాకుండా పెద్ద మచ్చలా కనిపిస్తే దాన్ని బాక్టీరియల్ న్యుమోనియాగా గుర్తిస్తారు. వైరస్, బాక్టీరియా తేలిన తర్వాత దానికి అనుగుణంగా మెడిసిన్ ఇస్తారు.

చలికాలంలో వైరల్ న్యుమోనియా

చలికాలంలో వైరల్ న్యుమోనియాలు ఎక్కువగా వస్తాయి. సీజన్ ఆరంభం నుంచీ వీటి ప్రభావం కనిపిస్తుంది. బాక్టీరియల్ న్యుమోనియాలు ఎప్పుడైనా రావచ్చు. వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉండేవారికి ఎక్కువగా వస్తాయి. రెండేళ్ల చిన్నారులకు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలికంగా స్మోకింగ్ చేసేవారికి, రీనల్ ఫెయిల్యూర్ పేషెంట్, హెచ్ఐవీ, దీర్ఘకాలిక వ్యాధులకు స్టెరాయిడ్స్ వాడుతున్నవారికి కూడా రావొచ్చు. వీరితోపాటు కేన్సర్ పేషెంట్లు, ఊపిరితిత్తుల వ్యాధులున్నవారికి, నియంత్రణలేని డయాబెటిస్ రోగులకు న్యుమోనియాలు ఎక్కువగా వస్తుంటాయి.

కొవిడ్ జాగ్రత్తలే...

ఏ రకం నిమోనియాకు అయినా కొవిడ్ జాగ్రత్తలే తీసుకోవాలి. మాస్కు ధరించడం, సోషల్ డిస్టెన్స్ మెయింటైన్ చేయడం, తరచూ చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటివి చేయాలి. తుంపర్లు ద్వారా ఇతరులకు త్వరగా వ్యాపించే అవకాశం ఉన్నందున మాస్కు ధరించడం శ్రేయస్కరం అని వైద్యులు చెబుతున్నారు.



కాలుష్యం.. కోనోకార్పస్ చెట్లూ

ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో వాహనాల సంఖ్య ఎక్కువ. ఈ నగరాలకు దగ్గర్లో పరిశ్రమలు ఉన్నాయి. వాహనా లతో పాటు ఫ్యాక్టరీల నుంచి వచ్చే వాయు కాలుష్యంతో నిండిన గాలి పీల్చినవారికి న్యుమోనియా సంక్రమించే అవకాశాలున్నాయి. అందు వల్ల వ్యాధినిరోధకశక్తి తక్కువ ఉన్న వారు మాస్కు ధరించడం ఉత్తమం. అలంకారం కోసం, నీడ కోసం రోడ్లకు ఇరువైపులా నాటిన కోనోకార్పస్ చెట్లు పెద్ద నగరాలు, మునిసిపాలిటీల్లో ఎక్కువ. ఈ చెట్ల వల్ల.వాటి పూల పిప్పొడి మనిషి ఊపి రితిత్తుల్లోకి వెళ్లి ఇన్‌ఫెక్షన్ చేరి న్యూమోనియాకు దారితీసే అవకాశాలున్నాయి.కొన్ని కెమికల్స్, రేడియేషన్ వల్ల కూడా న్యుమోనియా రావచ్చు.ఇన్‌ఫెక్షన్ల వల్ల కాకుండా నాన్ ఇన్‌ఫెక్షన్ల వల్ల వస్తుంటాయి.

ముందే మేల్కొంటే మంచిది..

సకాలంలో చికిత్స చేయించుకుంటే న్యుమోనియా పెద్ద జబ్బేమీ కాదు. కానీ నిర్లక్ష్యం చేస్తే మాత్రం మరణానికి చేరువై భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. న్యుమోనియా ఊపిరితిత్తుల్లో ఏర్పడుతుంది.ఈ వైరస్ ఒకేసారి చుట్టుముట్టి ఎక్కువ మందిని ప్రభావితం చేసి మరణం వరకు తీసుకెళ్తుంది.ఈ తరహాలో 2000లో బర్డ్‌ఫ్లూ, 2009లో స్వైన్‌ఫ్లూ, 2018లో నిఫా వైరస్, 2020లో కొవిడ్ వచ్చి ప్రాణాంతకంగా మారి ఎంతో మంది మరణానికి కారణమయ్యాయి.ఇవన్నీ వైరల్ న్యు మోనియా జ్వరాలే.ఇవి కాకుండా సాధారణంగా వ్యాప్తి చెందేవి బ్యాక్టీరియల్ న్యుమోనియా జ్వరాలు.ఇవి వ్యాధినిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో కనబడతాయి.

సకాలంలో వైద్యమే మందు

సకాలంలో న్యుమోనియాకు వైద్యం చేయించుకోకపోతే లోపల ఉన్న ఇన్‌ఫెక్షన్ వల్ల రసిపట్టడం.. ఛాతీలోకి రసి చేరడం, ఒక్కోసారి క్రిములు దేహమంతా వ్యాపిస్తాయి. న్యుమోనియా బాగా ముదిరితే అది రక్తంలోకి చేరుతుంది. దీన్ని సెప్టిసేమియా అంటారు. రక్తంలో నుంచి శరీర ప్రధాన అవయవాలైన కిడ్నీ, లివర్, గుండె, బ్రెయిన్‌కు వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో మల్టీ ఆర్గాన్స్ ఫెయిలై కోమా లేదా ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయి. మల్టీ ఆర్గాన్స్‌కు వెళితే యాంటీ బయాటిక్స్ ఇవ్వడం ద్వారా నయం చేసే అవకాశంఉంది.వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉంటే ఆగస్టులో ఇన్‌ఫ్లు యేంజా వ్యాక్సి న్ లేదా న్యూమోకోకిల్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.

వైద్యులేమంటున్నారంటే..

ముందు జాగ్రత్తతో తరిమేయవచ్చు



ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ సకాలంలో వైద్యచికిత్స తీసుకుంటే ప్రాణాంతకమైన న్యూమోనియా జ్వరాన్ని తరిమేయవచ్చు. ఆయాసం అధికంగా ఉన్నా, దగ్గుతో కూడిన కళ్లి పడుతున్నా, ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైనా, పల్స్ ఆక్సీమీ టర్ పరీక్ష చేసుకుని శాచురేషన్ 85 కన్నా తక్కువగా ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. కాకి నాడ జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలు..వెంటిలేటర్ల సదుపాయం ఉంది. - డాక్టర్ సూర్యకుమారి, పల్మనాలజిస్ట్, జీజీహెచ్, కాకినాడ

కొవిడ్ తరహాగానే ఉంటుంది..



అత్యవసరమైతే రాజమహేంద్రవరం బోధనాస్పత్రిలో వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయి. కొవిడ్ కూడా న్యూమోనియానే కానీ అది పాండమిక్ కావడంతో మరణాలు పెరిగాయి. న్యుమోనియాను ప్రాథమిక దశలోనే గుర్తించి యాంటీబయాటిక్స్ ఇవ్వడం ద్వారా రోగి కోలుకుంటాడు. న్యుమోనియాను నయం చేయడంలో యాంటీ బయాటిక్స్ ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

-డాక్టర్ ఎం.కిరణ్, పల్మనాలజిస్ట్ , జీజీహెచ్, రాజమహేంద్రవరం


ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నోటిఫికేషన్ విడుదల

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లా రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈనెల 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈనెల 21న మధ్యాహ్నం 3గంటలలోపు నామినేషన్లు ఉపసంహరించుకోవాలన్నారు. డిసెంబరు 5న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

తొలిరోజు నామినేషన్ నిల్

తొలిరోజు సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఉషోదయాన..



కార్తీకమాసం సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రం భక్తజనంతో నిండుగా ఉంది.. ప్రత్యక్ష దేవుడు సూర్యభగవానుడు.. సోమవారం వేకువజామున మెల్లమెల్లగా బయటకు వస్తూ.. గోదారమ్మలో కాసేపు తన వెలుగును ఇలా ప్రసరింపజేసి భక్తులకు కనువిందు చేశాడు.. గోదారమ్మలో లీనమై ముందు చల్లబడ్డాడు.. ఆ తరువాత మెల్లమెల్లగా ఉదయించాడు.. దీంతో భక్తజనం చల్లంగ చూడుస్వామి అంటూ మొక్కుకున్నారు.. ఈ సుందద దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.. - కొవ్వూరు

శివోహం

కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. రాజమహేంద్రవరంలో భక్తులు పోటెత్తడంతో పుష్కరఘాట్లు కిటకిటలాడాయి. మహిళలు గోదావరిలో కార్తీకదీపాలు విడిచిపెట్టారు. ద్రాక్షారామ, సామర్లకోట తదితర శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.



రాజమండ్రి పుష్కరఘాట్, కొవ్వూరులో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు



సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో జ్యోతిర్లింగార్చన పూజలు



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామివారు



పాదగయ క్షేత్రంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన సాహితి

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు సాహితి ఎంపిక

దేవరపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓరుగంటి సాహితి రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ఓరుగంటి నాగరాజు తెలిపారు. ఇటీవల విజయనగరంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనపరచడంతో అండర్-15 ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఆమె ఎంపికైనట్టు చెప్పారు. నవంబర్ 21 నుంచి 29 వరకు కటక్‌లో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో సాహితి పాల్గొంటుందని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో వడోదరలో జరిగిన రాష్ట్ర జట్టుకు ఎంపికైందని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొన్నట్టు తెలిపారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17ను పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి మూడోస్థానం సాధించినట్టు తెలిపారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన సాహితిని హెచ్‌ఎం శ్రీలక్ష్మి, పీఎంపీ ఛైర్మన్ వేముల రాజు, ఉపాధ్యాయులు గ్రామస్థులు అభినందించారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్



సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్

కాకినాడ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రుల నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2లక్షల 60వేలు పట్ట భద్రుల ఓట్లు నమోదు చేయించానని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో 3 లక్షల 50 వేల ఓట్ల నమోదు లక్ష్యానికి చేరుకుంటానన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఇచ్చిన అవ కాశాన్ని బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు. త్వరితగతిన అనుకున్న లక్ష్యం పూర్తి చేయాలని అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ పట్ట భద్రుల ఓట్లు నమోదులో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు, నేతలు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు.

వెయ్యిగుడుల వెలుగు కోసం భక్తి చైతన్యసభ

మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వెయ్యి గుడుల వెలుగుకోసం భక్తి చైతన్య ముగింపు సభ అప్పనపల్లి బాలాజీ సన్నిధిలో సోమవారం రాత్రి జరిగింది. ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, సినీ పాటల రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ఎం.ఎం.శ్రీలేఖ తదితరులకు అర్చకులు స్వాగతం పలికారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాల్లో వెలుగులు విరజిమ్మేలా ప్రజలను చైతన్యవంతులను చేయడానికే వెయ్యి గుడుల వెలుగు కోసం భక్తి చైతన్య సభ కార్యక్ర మం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెలుగు రాష్ట్రా ల్లోని ప్రముఖ దేవాలయాలను వారు సందర్శిస్తున్నారు. సోమవారం వారంతా అయినవిల్లి ఆలయాన్ని, అంబాజీపేట మండలంలోని ఏకాదశ రుద్రులను దర్శించుకున్నారు. సభలో జొన్నవిత్తుల రచించిన గీతాలను ఆవిష్కరించారు.



అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సినీ పాటల రచయిత జొన్నవిత్తుల, ఎంఎం శ్రీలేఖలకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న దృశ్యం



బీసీ హాస్టల్‌లో విచారిస్తున్న బీసీ సంక్షేమాధికారి ప్రసాదరావు

రాజోలు బీసీ హాస్టల్ వార్డెన్ పాండురంగ సస్పెన్షన్

రాజోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'బీసీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ స్పందించారు. రాజోలు బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ హెచ్.పాండురంగను సస్పెండ్ చేశామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి టీవీ ప్రసాదరావు సోమవారం తెలిపారు. బీసీ సంక్షేమాధికారి ప్రసాదరావు విద్యార్థులను హాస్టల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజోలు బీసీ బాలుర హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్‌గా ముక్తేశ్వరానికి చెందిన వార్డెన్ సీహెచ్ సాయిరామ్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. రాజోలు తహసీల్దారు ప్రసాద్ హాస్టల్‌లోని సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు



హారం సమర్పిస్తున్న దాతలు

సత్యదేవునికి రూ.2.50 లక్షలు విలువైన ముత్యాలు, పచ్చల హారం సమర్పణ



అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి సోమవారం సుమారు రూ.2.50 లక్షల విలువచేసే బంగారంతో చేయించిన 49 గ్రాముల ముత్యాలు, పచ్చల హారాన్ని హైదరాబాద్‌కు చెందిన తుర్లపాటి అనిల్‌కుమార్ అందజేశారు. దాతను ఈవో రామచంద్రమోహన్ అభినందించారు. ఈ హారంలో 20 గ్రాముల బంగారం, 29 గ్రాముల పెరల్స్ ఉన్నాయని ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు.



దర్శనం అనంతరం సత్యదేవుని సన్నిధిలో సేదతీరుతున్న భక్తులు

రత్నగిరి... భక్త సిరి

కార్తీక సోమవారం సందర్భంగా భక్తజనసంద్రం

ఒక్కరోజు ఆదాయం రూ.80లక్షలు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి కార్తీక సోమవారం పర్వదినాన భక్తులు పోటెత్తారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలను ప్రారంభించారు. సుమారు 70వేల మంది స్వామిని దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.80 లక్షల ఆదాయం లభించింది. సత్రం గదులు దొరకని భక్తులకు విష్ణుసదన్ హాల్స్ రెండు డార్మెటరీల్లో ఉచిత వసతి ఏర్పాటుచేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఈవో రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి భక్తులకు సూచనలిచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం మహిళలు రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. సోమవారం 8,359 జంటలు సత్యదేవుని వ్రతం ఆచరించారు.



రాజమహేంద్రవరంలోని అప్సర థియేటర్లో ప్రేక్షకులను పలకరిస్తున్న వరుణ్‌తేజ్

మట్కా... పక్కా మాస్ మూవీ

రాజమహేంద్రవరంలో హీరో వరుణ్‌తేజ్ సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మట్కా పక్కా మాస్ మూవీ... మెగా అభిమానులను అలరిస్తుందని మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ అన్నారు. మట్కా చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం ఆయన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సందడి చేశారు. మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మెగా అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నగరంలోకి చేరుకుని ఏవీ అప్పారావు రోడ్డు నుంచి అప్సర థియేటర్ వరకు మెగా ర్యాలీ నిర్వహించారు. వరుణ్‌తేజ్ థియేటర్‌లోకి వచ్చి ప్రేక్షకులతో కలిసా ట్రైలర్‌ను తిలకించారు. మట్కా చిత్రం ఈ నెల 14న విడుదల అవుతుందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు ఏడిద బాబీ, అభిమానులు వానపల్లి ఆంజనేయులు (ఫొటో బాబీ), జానీ, సరదా శ్యామ్ బాబు, రాజ్‌కుమార్, భరద్వాజ్ పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రశాంతితో సమావేశమైన యువ కలెక్టర్లు

క్షేత్ర స్థాయి అవగాహనే కీలకం

ఐఏఎస్‌లకు శిక్షణలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ శిక్షణలో క్షేత్రస్థాయి అవగాహన అత్యంత కీలకమని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికై శిక్షణ పొందుతున్న అధికారుల బృందం క్షేత్రస్థాయి కేస్ స్టడీ, పరిశోధనలో భాగంగా జిల్లాలో ఏడు రోజుల పాటు పర్యటించారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పీజీఆర్ఎస్‌ను పరిశీలించారు. బృందంలో యువ ఐఏఎస్‌లు మన్నన్ సింగ్, అనురాగ్ బబెల్, ప్రియారాణి, షాహీదా బేగం, పార్థ్, కశిష్ భక్షి, స్నేహపన్న, జాదవ్‌రావు, నిరంజన్ మహేంద్రసింగ్, తుషార్ నెగి, అతుల్ మిశ్రా ఉన్నారు.

కార్మికుల కష్టానికి...



'ఈ-శ్రమ' సాయం

అసంఘటిత కార్మికులకు వరం

(శంఖవరం-ఆంధ్రజ్యోతి)



అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఈ-శ్రమ' కార్డులు అందిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 60 లక్షలు జనాభా ఉండగా అందులో 9 లక్షల నుంచి 11లక్షల వరకు అసంఘటిత కార్మికులు ఉంటారని అంచనా. ఇప్పటి వరకు సుమారు 6.11లక్షల మంది కార్మికులు ఇ-శ్రమ పోర్టర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరికి యూనివర్సల్ ఐడింటిఫికేషన్ నంబర్ (యుఐఎన్) వస్తుంది. ఈ-శ్రమ కింద నమోదు చేసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 2లక్షల ప్రమాద బీమా వస్తుందని అధికారులు చెప్తున్నారు. కొన్ని సంక్షేమ పథకాల గురించి ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల వాటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వాటిలో 'ఈ-శ్రమ' కార్డు ఒకటిగా చెప్పుకోవచ్చు. ఈ కార్డు కార్డు పొందడం వల్ల 2లక్షల ప్రమాద బీమాతో పాటు మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం....

ఈ-శ్రమ కార్డ్ అంటే ఏంటంటే:

అసంఘటిత రంగంలో పనులు చేస్తున్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక కార్డు. భవన నిర్మాణం, చేతివృత్తుల్లో పనిచేసే కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్సు వంటి సౌకర్యాలు ఉండవు. ఏళ్ల తరబడి పనులు చేస్తున్నా గ్రాట్యుటీ అంటేనే వీళ్లకు తెలియదు. అటువంటి శ్రమజీవుల భవిష్యత్తు భద్రత కోసం, వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ కార్డు పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

ఎలా నమోదు చేసుకోవాలంటే....

ఈ-శ్రమ కార్డు పొందేందుకు ఆన్‌లైన్‌లో Eshram.gov.inలో నమోదు చేసుకోవాలి.

ముందుగా ఆధార్ కార్డుతో లింకైన మొబైల్ నెంబరుతో రిజిస్టర్ చేసుకోవాలి.

ఆ తర్వాత మొబైల్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్‌చేసి లాగిన్ అవ్వాలి.

అనంతరం అడ్రస్, విద్యార్హతలు వంటి వివరాలు పొందుపరచాలి.

అలాగే ఏపనిలో నైపుణ్యం ఉంది, పని స్వభావంతో పాటు బ్యాంకు అకౌంట్ వివరాలు ఎంటర్ చెయ్యాలి.

ఇక చివరిగా ధ్రువీకరణ కోసం మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చెయ్యడం ద్వారా ఈజీగా ఈ-శ్రమ కార్డుకు అప్లై చేసుకోవచ్చు.

ఓటీపీ సదుపాయం లేకపోతే బయోమెట్రిక్ ఫింగర్ ప్రింటు, ఐరిస్, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వివరాలతో సమీపంలోని కస్టమర్‌కేర్ సెంటర్లో నమోదు చేసుకోవాలి.

ప్రయోజనాలివే

ఈ-శ్రమ కార్డు తీసుకున్న కార్మికులు దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురై పాక్షిక దివ్యాంగులుగా మారితే కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష చెల్లిస్తుంది.

అదే శాశ్వత వైకల్యం లేదా మరణం సంభవించినప్పుడు రూ.2 లక్షలు బీమా బాధిత కుటుంబానికి లభిస్తుంది.

ఈ-శ్రమ కార్డు కేవలం ఇన్సూరెన్స్ మాత్రమే కాకుండా వారి పిల్లలకు ఉచిత సైకిళ్లు, పనిముట్లు, కుట్టుమిషన్లు వంటి ఇతర ఆర్థిక సహాయాలు అందుకునే అవకాశం ఉంది.

వీరంతా ప్రయోజనం పొందవచ్చు...

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రోజువారీ కూలీలు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, తక్కువ వేతనాలు అనగా.. రూ.15వేలులోపు వేతనాలు అందుకుంటున్న ఉద్యోగులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించని వారు, రేషనుకార్డుదారులు.... ఇలా 16 నుంచి 59 ఏళ్లలోపు ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

పాదగయలో అపచారంపై ఉన్నతాధికారుల సీరియస్

దేవదాయ శాఖ ఉప కమిషనరు విచారణ



రమేష్‌బాబుకు సంఘటనలను వివరిస్తున్న భజరంగదళ్, వీహెచ్‌పీ, హిందూ సంఘాల ప్రతినిధులు

పిఠాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగిన సంఘటనలపై దేవదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబు సోమవారం విచారణ చేపట్టారు. పాదగయలోని హోమ గుండాల్లో హోమ ద్రవ్యాలు కాకుండా దర్శనాల టిక్కెట్లు, రశీదు వేసి దగ్ధం చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇటీవల పాదగయ క్షేత్రంలో అఘోరాను దుస్తులు లేకుండా దర్శనానికి అనుమతించడం, అన్యమతస్తుడిని విధుల్లో ఉంచి పూజా ద్రవ్యాలను అతడితో నిర్వర్తించడం తదితర అంశాలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో డీసీ విచారణ చేపట్టారు. పాదగయ అధికారులు, సిబ్బందిని విచారించారు. రికార్డులను పరిశీలించారు. హోమగుండంలో రశీదు, టిక్కెట్ పుస్తకాలను ఎవరి ఆదేశాలతో వేశారో ఆరా తీశారు. పాదగయలో జరుగుతున్న వరుస సంఘటనలు భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, భజరంగదళ్, హిందూ సంఘాల ప్రతినిధులు డీసీని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీసీ రమేష్‌బాబు మాట్లాడుతూ పాదగయలో ఇటీవల చోటు చేసుకుంటున్న సంఘటనలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు తెలిపారు. రికార్డులను పరిశీలించడంతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నట్లు చెప్పారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పవిత్ర కార్తీకమాసంలో ఇటువంటివి జరగడం బాధాకరమని చెప్పారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఉన్నారు.



షాట్‌పుట్‌లో ఫస్ట్

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు మాధవి ఎంపిక



అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు అన్నవరం దేవస్థానంలో ఫార్మాసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మాధవి ఎంపికయ్యారు. ఈ నెల 6న గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీల్లో ఆమె ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 8వ తేదీన విజయవాడలో జరిగిన పోటీలో విజేతగా నిలిచిన వాలీబాల్ జట్టులో సభ్యురాలు. దీంతో ఈ రెండు క్రీడలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి మరో రెండు నెలల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా మాధవిని దేవస్థానం ఉద్యోగులు అభినందించారు. ఇప్పటికే ఆమె పలు పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. కుటుంబ సభ్యులు, దేవస్థానం ఉద్యోగుల సహకారంతో ఈ విజయాలను సొంతం చేసుకుంటున్నట్టు ఆమె చెప్పారు.



నుజ్జునుజ్జయిన లారీ

సెప్టిక్ ట్యాంక్‌ను ఢీకొన్న లారీ

- ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న సెప్టిక్ ట్యాంక్.. ట్యాంకర్ బోల్తా

దేవరపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి లారీ ఒకదానికి ఒకటి ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచలం నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురం వెళ్తున్న ధాన్యం లారీ దుద్దుకూరు సమీపంలో ఎదురుగా వెళ్తున్న సెప్టిక్ ట్యాంకును బలంగా ఢీకొంది. సెప్టిక్ ట్యాంకు ముందు.. వెళ్తున్న ఖాళీ ఆయిల్ ట్యాంకును ఢీకొనడంతో ఖాళీ ఆయిల్ ట్యాంకర్ తిరగబడింది. ఈ ఘటనలో ధాన్యం లోడు లారీ డ్రైవర్ రాజు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు ఖమ్మం జిల్లా భద్రాచలం గ్రామానికి చెందిన వ్యక్తి. మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇద్దరు చోరుల అరెస్టు

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇళ్ల తాళాలు పగలకొట్టి విలువైన ఆభరణాలను దొంగిలించడంలో అంతర్జాతీయ నేరస్తులుగా పేరొందిన ఇద్దరు దొంగలను కాకినాడ జిల్లా సామర్లకోట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సెప్టెంబరు 29న సామర్లకోట మండలం వేట్లపాలెంలోని గుణ్ణం సాయిబాబు మాస్టారు ఇంటిలో చోరీకి గురైన 186.79 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీకృష్ణభగవాన్, సీసీఎస్ సీఐ అంకబాబు వివరాలు తెలిపారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదికరకు చెందిన జిల్లెల్ల రాకేష్, తణుకు అర్బన్ కొత్తూరుకు చెందిన చావల కృష్ణ.. వేట్లపాలెంలో సాయిబాబు ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. 8 బంగారపు గాజులు, 2 జతల చెవిలీలు, 4 ఉంగరాలు, నల్లపూసలతో కూడిన రెండు చైన్లతో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. సమీప ఇంటిలో సీసీ ఫుటేజీ ద్వారా నమోదైన దృశ్యాలను పోలీసులు సేకరించారు. అందులో లభించిన సమాచారం మేరకు తణుకుకు చెందిన అంతర్జాతీయ దొంగలుగా పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 52 చోరీల్లో కేసులు నమోదైన వీరి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. వారిద్దరినీ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వరుస చోరీలకు పాల్పడడం, పట్టుబడడం, జైలుకు వెళ్లడం, తిరిగి బెయిల్‌పై విడుదల కావడం, చోరీలకు పాల్పడడంలో వీరిద్దరూ అంతర్జాతీయ దొంగలుగా పోలీసు రికార్డుల్లో నమోదై ఉన్నారన్నారు. బంగారు ఆభరణాలను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం 5వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నట్టు సీఐ శ్రీకృష్ణభగవాన్ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, చోరీ జరిగిన తీరును వివరిస్తున్న సీఐ శ్రీకృష్ణ భగవాన్



బీచ్ రోడ్డులో నేమాం సమీపంలో వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు, ఉప్పాడ తీరంలో అడ్డుగా విరుగుతున్న కెరటాలు

తీరంలో అలజడి

కెరటాల ధాటికి నేమాం సమీపంలో కోతకు గురైన బీచ్ రోడ్డు

కొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా సోమవారం కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్రం కల్లోలంగా మారింది. మధ్యాహ్నం నుంచి తీరం వెంబడి ఈదురుగాలులు బలంగా వీచాయి. కెరటాలు ఉవ్వెత్తున పైకి లేచి బీచ్ రోడ్డును తాకుతున్నాయి. ఉప్పాడ శివారు కొత్తపట్నం నుంచి విద్యుత్ ప్లాంటు, కొమరగిరి జగనన్న కాలనీ వరకు బీచ్ రోడ్డుపైకి అలలు దూసుకువస్తున్నాయి. కొమరగిరి పేదల ఇళ్ల కాలనీ-నేమాం మధ్యలో వంతెనకు సముద్ర కెరటాలు పోటెత్తడంతో వంతెన వద్ద అప్రోచ్ సమీపంలో బీచ్ రోడ్డు కోతకు గురైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లతో ఉప్పాడ, నేమాం బీచ్‌లకు విచ్చేసిన పర్యాటకుల భద్రత నిమిత్తం పహారా ఏర్పాటు చేశారు. పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

సర్పవరం జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ పద్మతులసి ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు మధురవాణి, జోన్ చైర్మన్ ఓం నమశ్శివాయ, క్లబ్ కార్యదర్శి సుజాత,కోశాధికారి వీణానాగిని ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలు రాజకీయ పార్టీల నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారిలా...

రాష్ట్ర బడ్జెట్‌లో నిజాయితీ ఉంది

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిజాయితీ ఉంది. గతంలో వైసీపీ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉండేది. నేడు వాస్తవాన్ని ప్రతిబింబిస్తూ జనరంజకంగా ఉంది. ఇరిగేషన్, పంచాయతీరాజ్ సహా సంక్షేమ పథకాలకు అధికంగా నిధులు కేటాయించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రాధాన్యం ఇచ్చారు.



-ఎస్వీఎస్ఎన్ వర్మ, మాజీ ఎమ్మెల్యే, పిఠాపురం

అన్నిరంగాలకు సమ ప్రాధాన్యం

రాష్ట్ర బడ్జెట్‌లో అన్నివర్గాలకు సమప్రాధాన్యం లభించింది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. సంక్షేమంతో అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయించారు. బడ్జెట్‌తో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతుంది.



-మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి

సముచిత కేటాయింపులు

బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి బడ్జెట్‌లో సముచిత కేటాయింపులు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు కేటాయింపులు చేయలేదు. కూటమి ప్రభుత్వం బీసీ వర్గాలకు చెందిన కార్పొరేషన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం మంచి పరిణామం. హెల్త్, ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం చేసి ఉంటే బాగుండేది.

-చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

కేటాయింపులు బాగున్నాయి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయింపులు బాగున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నా కూటమి ప్రభుత్వం చాలా దృఢత్వంతో బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. బడ్జెట్‌లోని ప్రతిపాదనలు అమలైతే రాష్ట్ర అభివృద్ధి జరుగు తుంది.



-తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

గొంతెండిపోతోంది!

సూర్యారావుపేటలో వారం రోజులుగా అందని తాగునీరు

ఆందోళనలో మత్స్యకారులు

సర్పవరం జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం కోట్లాది నిధులు వెచ్చిస్తున్నా ప్రజలకు తాగునీరు మాత్రం పూర్తిస్థాయిలో అందడం లేదు. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. కాకినాడ రూరల్ మండలంలో రెండు సీపీడబ్ల్యూ స్కీములు అమల్లో ఉన్నా పథకం అమల్లో సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేక ప్రజలకు సక్రమంగా తాగునీరు సరఫరా జరగడం లేదు. సూర్యారావుపేట సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా పథకం పేరుతో పండూరులో ఏర్పాటు చేసిన సీపీడబ్ల్యూ పథకం నుంచి తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. మత్స్యకార గ్రామం సూర్యారావుపేటలో సుమారు 10 వేలు జనాభా ఉన్నారు. తీరప్రాంతం కావడంతో స్థానికంగా బావులు, బోరుల ద్వారా లభించే నీరు ఉప్పుగా ఉండడంతో తాగేందుకు ఏమాత్రం పనికిరావు. ప్రజలకు తాగునీటి సరఫరా కోసం పంచాయతీ పరిధిలో ఫైనరీపేట, పరకాలువలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. సూర్యారావుపేట ప్రధాన గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు లేవు. గ్రౌండ్



సూర్యారావుపేటలో గ్రౌండ్ లెవెల్ ట్యాంకు

లెవల్ ట్యాంకులు, ప్లాస్టిక్ ట్యాంకులు శెట్టిబలజపేట రామాలయం, బీసీ కాలనీ, తుపాను బిల్డింగ్, లైట్‌హౌస్ వద్ద వీటిని ఏర్పాటు చేశారు. పండూరు నుంచి పైపులైన్ల ద్వారా వీటికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. సూర్యారావుపేటకు తాగునీటి సరఫరాలో ఏళ్ల తరబడి సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేసిన దాఖల్లేవనాన్నరు. తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడంలో అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో పూర్తిస్థాయిలో ఏనాడు తాగునీటిసరఫరా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోయినా ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో దాహార్తితో ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులు తెలిపారు. ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేయాలని



తాగునీరు సరఫరా లేక కుళాయి వద్ద ఖాళీ బిందెల దృశ్యం

కోరినా పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిందె, ప్లాస్టిక్ కేన్‌లను రూ. 10 నుంచి 20 చెల్లించి తాగునీరు కొనుక్కోవలసిన పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే తాగునీటి సరఫరాకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హర హర మహాదేవ



సామర్లకోట భీమేశ్వరాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ దంపతుల పూజలు

సామర్లకోట, నవంబరు11 (ఆంధ్ర జ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలు పదో రోజు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. రెండవ కార్తీకసోమవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం జరిగిన లక్షపత్రి పూజల్లో సామర్లకోటకు చెందిన సుంకర శేషసాయి అభిరామ్ దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజలు, జ్యోతిర్లింగార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు 5,000మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. పంచారామ దర్శిని పేరిట సుమారు 136 బస్సులలో భక్తులు ఆలయానికి చేరుకుని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. లయన్స్ క్లబ్ సౌజన్యంతో సుమారు 5 వేలమంది భక్తులకు అల్పాహారాన్ని అందజేసారు. భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ సౌజన్యంతో సుమారు 800 మంది భక్తులకు రాత్రి భోజనాలు ఏర్పాటుచేసారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా సుమారు 500 మంది భక్తులకు రాత్రి భోజనాలు ఏర్పాటుచేసారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయానికి జిల్లా ఎస్పీ దంపతులు విచ్చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎస్పీ సతీమణి ఏపీఎస్‌పీ మూడవ బెటాలియన్ కమాండెంట్ భావన భీమేశ్వర స్వామికి, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ఎస్పీ దంపతులు ప్రసాదాలు స్వీకరించారు. భీమేశ్వరాలయంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆహారసదుపాయాలపై ఆలయ అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, డబుల్‌సెవెన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస విశేష పూజలు



తాళ్లరేవు మండలం పిల్లంక శివాలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

తాళ్లరేవు: చొల్లంగి నుంచి పిల్లంక వరకు ఉన్న శివాలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు నిర్వహించారు. పాతకోరింగ చారిత్రకత కలిగిన బాలత్రిపురం సుందరి కురంగేశ్వర ఆలయంలో అభిషేకాలను నిర్వహించారు. పిల్లంక శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ఏలూరి కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో భక్తులు లక్షపత్రి, బిల్వార్చన, తులసి, రుద్రాక్షలతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తాళ్లరేవు కేశవస్వామి ఆలయంలో భక్తులు కార్తీకపూజలు చేపట్టారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు పట్టణంలోని ఆలయాలన్ని కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. శివాలయానికి భక్తులు పోటెత్తారు. ఉమారామలింగేశ్వరస్వామి దర్శనానికి బారుల తీరారు. స్వామికి అభిషేకాలు జరిగాయి.

గొల్లప్రోలు రూరల్: మండలంలోనిశివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. దుర్గాడ శివాలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఏకా దశ రుద్రాభిషేకం, విశేష అలంకారం చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. భక్తులు భారీగా బారులు తీరి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చేబ్రోలు శివాలయంలో పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి అభిషేకాలు జరిగాయి. ఆయా ఆలయకమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. కార్తీకమాసం రెండవ సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు తెల్లవారుజామునే చేరుకుని పరమశివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు తదితర పూజాదికాలను నిర్వహించారు. పట్టణ పరిధిలోని విశ్వేశ్వర చంద్రశేఖరస్వామి, కట్టమూరు రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి, కాండ్రకోటలో భువనేశ్వరీ దేవీ సమేత కోటేశ్వరస్వామి, తిరుపతిలో సోమే శ్వరస్వామి ఆలయం, ఆర్‌బీపట్నంలో చంద్రశేఖరస్వామి ఆలయాల్లో కార్తీకమాస ప్రత్యేక పూజలు జరిగాయి.

ముగిసిన రామస్వామి శతజయంతి మహోత్సవాలు

మహాసంస్థానంలో ప్రత్యేక పూజలు



శ్రీపాదశ్రీవల్లభుడు, నృసింహసరస్వతి, దత్తాత్రేయస్వామికి ప్రత్యేక అలంకారం

పిఠాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం పీఠాధిపతి, సద్గురు సజ్జనగడ రామస్వామి శతజయంతి మహోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం శతజయంతి సందర్భంగా శ్రీపాదశ్రీవల్లభస్వామికి, సద్గురు రామస్వామి దివ్యపాదులకు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. హోమం, పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, నృసింహ సరస్వతి, దత్తాత్రేయస్వామిలకు పుష్పార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆర్.సౌజన్య పాల్గొన్నారు.



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో నిర్వహించిన హోమం

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 32మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు, ఎన్.రమేష్ డి.రామారావు తమ బృందాలతో ఆదివారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 32మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, మరో 18మందికి ఒక్కొక్కరికీ రెండురోజుల చెప్పున జైలు శిక్ష, మిగతా 13 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

'బూత్‌స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయాలి'

పిఠాపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బూత్‌స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయాలని బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓలేటి వెంకటేశ్వరరావు తెలిపారు. పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో సోమవారం బీజేపీ సంఘటన్ పర్వ్ 2024 కార్యశాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణపై చర్చించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, పిఠాపురం మండలశాఖ అధ్యక్షుడు పిల్లా ముత్యాలరావు, వాసంశెట్టి శ్రీనివాస్, వెన్నా సుబ్బారావు, బొజ్జ చక్రి, తోట ఏడుకొండలు, బుర్రి మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ అక్కరాజు మృతి

సామర్లకోట, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మాజీ కౌన్సిలర్, బీజేపీ రాష్ట్ర నాయకునిగా గుర్తింపు పొందిన యార్లగడ్డ అక్కరాజు(72) అస్వస్థతతో సోమవారం రాత్రి సామర్లకోటలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. 1981లో తొలిసారిగా సామర్లకోట మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలుపొందారు. తదనంతరం 1987లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ తరపున మున్సిపల్ చైర్మన్‌గానూ, కౌన్సిలర్‌గానూ పోటీచేయగా స్వల్పఓట్లతేడాతో చైర్మన్‌గా ఓటమి చెందినప్పటికీ కౌన్సిలర్‌గా గెలుపొందారు. గత కొద్దికాలంగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. అక్కరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. అక్కరాజు మృతి పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

104 వ్యవస్థను ప్రభుత్వమే నడపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న 104 ఉద్యోగులు

కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల నిరసన దీక్ష

కాకినాడ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 104 వ్యవస్థను ప్రభుత్వమే నడపాలనే డిమాండ్‌తో 104 ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద సంబంధిత ఉద్యోగులు ఒకరోజు నిరసన దీక్ష చేశారు. ఈ దీక్షను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ 104 అంబులెన్స్‌ల నిర్వహణ పేరుతో అరబిందో సంస్థకు ఒక్కో వాహనానికి రూ.లక్షా20వేల చొప్పున చెల్లించారని, అసలు ఖర్చు వాహనానికి రూ.60వేలు మాత్రమేనన్నారు. ఇప్పటివరకు మిగిలిన సొమ్ము రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్లిందన్నారు. అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 104 నిర్వహణ భారంగా మారకుండా ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, 104 ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కె.వెంకటరావు 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, త్రిమూర్తులు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్ల ఈశ్వరి, పలు సంఘాల నాయకులు చీకట్ల శ్రీనివాస్, రాధాకృష్ణ, గంగాధర్, ఈశ్వర్, కేపీ నాయుడు మాట్లాడారు. అనంతరం ఉద్యోగులు జిల్లా పరిషత్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన దీక్షను ముగించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాకినాడ ఉపాధ్యక్షుడు టి.అన్నవరం అధ్యక్షతన కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీ ఇసుక విధానం అధికార పార్టీలు వారికే అమలు జరుగుతుందన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీభవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం తరపున సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, ఈశ్వరరావు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా పరిష్కార వ్యవస్థకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇసుక లభ్యత పెంచాలన్నారు. ఇసుకను అధిక ధరలకు అమ్ముకుంటున్న మాఫియా ఆగడాలను అరికట్టాలన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

కొత్తపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, జాబ్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఎం (ఎంఎల్) లిబరేషన్, ఆంధ్రప్రదేశ్ వ్యవ సాయ, గ్రామీణ కార్మికసంఘం, అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం(ఐప్వా) ఆధ్వర్యంలో సోమవారం కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గొడుగు సత్యనారాయణ, ఐప్వా జిల్లా అధ్యక్షురాలు శీలం అప్పలరాజు మాట్లాడుతూ కొత్తపల్లి మండల పరిధిలో కోనపాపపేట, మూలపేట, ఉప్పాడ, కొత్తపల్లి, యండపల్లి, జొన్నలగరువు, వాకతిప్ప గ్రామాల్లో ఒక్కొక్క ఇంట్లో 2మూడు కుటుంబాలు జీవిస్తున్నారని, కొన్ని కుటుంబాలు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని తెలియజేశారు. ఇళ్లు లేనివారికి ఇళ్లు మంజూరు చేసి, వాటి నిర్మాణాలను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కమిటీ సభ్యులు రాజేష్, సోని, మహాలక్ష్మి, భవాని, లక్ష్మి ఉన్నారు.



తహశీల్దార్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



పెద్దాపురం నవోదయలో అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి నివాళులు

పెద్దాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయా విద్యాలయంలో జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నవోదయా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అజాద్ జన్మదినం రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పాపారావు, జగన్మోహనరావు, అప్పారావు, ప్రేమలత పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: తిమ్మాపురం అక్కా ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థి దశలో కష్టించి విద్యనభ్యసిస్తూ భవిష్యత్తు లక్ష్యసాధన కోసం ప్రణాళికలతో ముందుకు సాగాలని క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎం కమలకుమారి కోరారు. దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్‌కలాం అజాద్ విద్యాభివృద్ధికి విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.నానిబాబు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ ఎం.గోపి పాల్గొన్నారు.

సామర్లకోట: విద్యే వాస్తవ సంపద అని ప్రతి ఒక్కరూ విద్యనేర్వాలని సామర్లకోట అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ పేర్కొన్నారు. దేశ తొలి కేంద్ర విద్యామంత్రి అబుల్ కలామ్ అజాద్ జయంతి పురస్కరించుకుని సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల సమక్షంలో జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ అజాద్ చిత్రపటానికి హెచ్‌ఎం పూలమాల వేసి నివాళులర్పించి ఆయన గొప్పతనాన్ని సమగ్రంగా వివరించారు. ఉపాధ్యాయులు వి.రాజు, కెవీవీ.సత్యనారాయణ, కే.శ్రీనివాస్, శ్రీవల్లీ, డీవీఆర్ఎస్ వల్లీ, ఎంవీ. సత్యనారాయణ, పి.బ్రహ్మానందం, బేబీరాణీ, భద్ర పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం



ఆర్థిక సహాయం అందజేస్తున్న వర్మ

పిఠాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని 2వ వార్డులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వసం కోల్పోయిన బాధితుడిని పరామర్శించి రూ.10వేలు ఆర్థికసహాయం అందజేశారు. ప్రభుత్వం తరపున సహాయం అందించి పక్కాగృహం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు సోము సత్యనారాయణ, పిల్లి చిన్నా, కొరుప్రోలు శ్రీనివాస్ తదితరులున్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

గొల్లప్రోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి కుంచే చిన్నా, నందీశ్వరరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లు సమకూర్చడంలో మున్సిపల్‌అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చెత్తను తరలించే రిక్షాలు, ఇతర వాహనాలు మరమ్మతులకు గురై మూలనబడ్డాయని తెలిపారు. జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. కొవిడ్‌కాలంలోని 6నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. ఆందోళనలో యూనియన్ నాయకులు నీలాపు ఏసమ్మ, సత్యవతి, రమణ, రామారావు, రాజు, రాజులు, రాజమోహన్, పోలమ్మ,సింహాచలం తదితరులున్నారు.

'ప్రాణరక్షణ కల్పించండి'



కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న బాధిత కుటుంబీకులు

కాకినాడ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తట్టలు, బుట్టలు అల్లుకుని ఎరుకుల కులవృత్తి ద్వారా జీవిస్తున్న పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన తమపై వ్యక్తిగత కక్షతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చిన గ్రామంలోని అగ్ర కుల వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుని తమకు ప్రాణరక్షణ కల్పించాలని బాధితులు అమలదాసు గురుమూర్తి, అతడి కుటుంబీకులు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మాసగిరి రాంబాబు ఆధ్వర్యంలో కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు.

మద్యం దుకాణం తరలించాలని వినతి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ బాలాజీ చెరువుసెంటర్, టీటీడీ కల్యాణ మండపం వెనుక ఉన్న మద్యం దుకాణాన్ని వేరొక ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు జేసీ రాహుల్ మీనాకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. జనవాసాలు, స్కూల్స్, కళాశాలల మధ్య మద్యం దుకాణం ఉందని జేసీకి వివరించారు. స్కూల్స్‌కు సమీపంలో మద్యం దుకాణం ఇవ్వడం తగదన్నారు. కార్యక్రమంలో లక్ష్మీప్రసన్న, సుంకర సురేష్,ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పిఠాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహణలోని పిఠాపురం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేది నుంచి 20వ తేది వరకూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి ఆర్.వెంకటరాము తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి నిర్వహించే పోటీలు, ఇతర కార్యక్రమాల వివరాలును తెలియజేస్తూ పట్టణంలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఇతరులకు ఆయన సోమవారం ఆహ్వానపత్రికలు అందజేశారు. వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం, దేశభక్తిగేయాలు, వక్తృత్వ పోటీలు జరుగుతాయని, విజేతలకు 20న జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేయడం జరుగుతుందని వివరించారు. వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

'ప్రజాపోరు' పోస్టర్ ఆవిష్కరణ

పెద్దాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై జరుగుతున్న ప్రజాపోరును విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి కాంత్రికుమార్ అన్నారు. స్థానిక వరహాలయపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం ప్రజాపోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, నాగు, చల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు నిర్మాణంపై విచారణ నిర్వహించాలి'

సర్పవరం జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం పంచాయతీ పరిధిలో పల్లెపండుగలో భాగంగా రూ.77.50 లక్షల ఉపాధి హామీ నిధులతో కూలీల అవసరం లేకుండా ప్లాట్ కాంక్రీట్‌తో రోడ్డు నిర్మించారని, దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ నిర్వహించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కాళ్ల ధనరాజు డిమాండ్ చేశారు. జనావాసాలు లేని చోట నిర్మించిన రోడ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావేదిక పరిష్కార కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ముందుగా తయారు చేసిన మెటీరియల్ కాంక్రీట్ (ప్లాట్ కాంక్రీట్)తో రోడ్లు నిర్మించడంతో జాబ్‌కార్డు కూలీలకు ఉపాధి లేకుండాపోయిందని ఆయన చెప్పారు.

'డయల్ యువర్ కమిషనర్'కు 9 సమస్యలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి 9మంది ఫోన్‌లో తమ సమస్యలు విన్నవించారు. అనంతరం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ప్రజల నుంచి 50 అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. భారత తొలిప్రధాని జవహర్‌లాల్ జీవితచరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ పాత్రపై 8,9,10వ తరగతులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. బాలల దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సీఐటీయూ నాయకుడు ఓ.నందీశ్వరుడు, కుమార్, హరి పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆదిత్య'లో చండీయాగం

గండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వ విద్యాలయంలో ఈనెల 12 నుంచి 16 వరకు చతుర్వేద పారాయణ పురస్సర శ్రీ సహస్ర చండీయాగం నిర్వహించనున్నారు. ఏర్పాట్లను విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు చేశామని, చివరిరోజు అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రైతు సీతయ్య పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్

గిరిజన రైతుకు 'ఆంధ్రజ్యోతి' అండ

వరుస కథనాలతో ఏడాది తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ అందిందన్న సీతయ్య

కూనవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆ గిరిజన రైతు నిరీక్షణ ఫలించింది. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సోమవారం అతడి పొలంలో ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మండలంలోని కొనరాజుపేట గ్రామానికి చెందిన మెట్ట సీతయ్య ఏడాది క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అది అందలేదు. దీంతో గతేడాది సరైన నీరందక పంటలు ఎండిపోయాయి. ఈ విషయాన్ని సీతయ్య 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకురాగా అతడికి అండగా నిలిచింది. వరుసగా వచ్చిన కథనాలకు అధికారులు దిగొచ్చారు. ముందుగా విచారణ నిర్వహించారు. సోమవారం సీతయ్య పొలంలో విద్యుత్ స్తంభాలు, వైర్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. 'ఆంధ్రజ్యోతి' కథనాల వల్లే తనకు ట్రాన్స్‌ఫార్మర్ అందిందంటూ ఎంతో ఆనందపడుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.



నాటు మందు వైద్యులకు అవగాహన కల్పిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

'పసర మందు ప్రాణాంతకం'

చింతూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పసర మందు ప్రాణాంతకమని చింతూరు ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు చింతూరు డివిజన్‌లోని దాదాపు వంద మంది నాటు వైద్యులు హాజరయ్యారు. పీవో వారికి పలు సూచనలిచ్చారు. ఎవరైనా నాటు మందు ఇవ్వమని ఆశ్రయించిన పక్షంలో తక్షణ వారిని సమీప ప్రాథమిక వైద్యశాలకు వెళ్లాల్సిందిగా సూచించాలన్నారు. లేదా స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. నెలల వయసున్న చిన్నారులకు పసర మందు తాగించడంతో పొలమారి చివరకు ఊపిరాడక మృత్యువాతపడుతున్న విషయం గుర్తించాలన్నారు. కొందరు నాటు మందు వైద్యులు పిల్లల బొడ్డు చుట్టూ వాతలు పెడుతున్నారని, ఇకపై ఆ తరహా అనాలోచిత వైద్యాన్ని నిలిపివేయాలన్నారు.

చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ హర్ష మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న క్రమంలో వెంటనే ఆసుపత్రికి రావాల్సిందిగా కోరారు. రెండు, మూడు రోజులు ఆలస్యం చేయడంతో చివరకు ఆ వ్యాధి నయం కాని పరిస్థితి ఏర్పడుతోందన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ప్రత్యేక నవజాత శిశు వైద్యశాల వైద్యుడు ఉమర్, ఏటీడబ్ల్యూవో సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

రంపచోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచుతూ చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ, ప్రగతిశీల మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చి పేద కుటుంబాల్లో దీపం వెలిగించామని చెపుతూ మరోవైపు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం వేస్తోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య, కత్తుల బాలిరెడ్డి, పల్లాల అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సింహాచలం

రంపచోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన గిరిజన సంక్షేమం, గృహ నిర్మాణ, రోడ్లు భవనాలు, విద్యుత్, పంచాయతీరాజ్, స్పెషల్ మైనర్ ఇరిగేషన్ శాఖల్లో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. పూర్తిస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డీఈలు సాయిసతీష్, చైతన్య, రామచంద్రమూర్తి, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, నాగరాజు, ఏఈలు సత్యనారాయణ, పి.వెంకటరమణ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు



ఎటపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచుకలపాడులో ఓ చెరువు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి, రవాణాకు పాల్పడుతున్న నాలుగు టిప్పర్లను, ఎక్స్‌కవేటర్లను రెవెన్యూ అధికారులు ఆదివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పిచుకలపాడులో చెరువు మట్టిని అక్రమంగా తవ్వుతూ భద్రాచలంకు తరలిస్తున్నారని, రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో తహసీల్దారు కారం సుబ్బారావు తన సిబ్బందితో అక్కడికి వెళ్లారు. మట్టి లోడ్ చేసుకుని సిద్ధంగా ఉన్న నాలుగు టిప్పర్లను, ఎక్స్‌వేటర్ పట్టుకుని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిప్పర్లు భద్రాచలం, కన్నాయిగూడెం గ్రామాలకు చెందిన వ్యక్తులవిగా తెలుస్తోంది. పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేశారు.

రేపు, ఎల్లుండి ఎన్‌పీసీఎల్ లింకింగ్ మేళా

రంపచోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని తపాలా శాఖ కార్యాలయాల్లో ఈ నెల 13, 14 తేదీల్లో ఎన్‌పీసీఎల్ లింకింగ్ మేళా నిర్వహిస్తున్నట్టు డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందాలంటే లింకింగ్ తప్పనిసరని... ఆధార్, సెల్ నెంబరుతో సమీప పోస్టాఫీస్‌లో సంప్రదించాలని కోరారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కిటకిటలాడిన శివాలయాలు

రెండో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు





ఏలేశ్వరం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు, తొండంగిలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు

ఏలేశ్వరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలో ఏలేరు నదీతీరాన వేంచేసిన శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు కోడూరి మహేష్, శేఖర్, వెంకటేష్ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో శైవ క్షేత్రాలతో పాటు పలు ఆలయాలు భక్తులు, అయ్యప్ప స్వాములు, మహిళలతో కిక్కిరిశాయి.

తునిరూరల్: రెండో కార్తీక సోమవారం పురస్కరించుకుని తేటగుంట ఉమా మహేశ్వరస్వామి ఆలయం, తిమ్మాపురం ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, తునిలో తాండవ లింగేశ్వర ఆలయం, తపోవనం శివాలయం క్షేత్రాల్లో వేకువ జామున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక అభిషేకాలు, కార్తీక పూజలు ఆచరించారు.

తొండంగి: తొండంగి రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వరుని ఆలయంలో తెల్లవారు జాము నుంచి భక్తులు అభిషేక సేవలో పాల్గొన్నారు. ఏ కొత్తపల్లి కదంబ క్షేత్రంలో విజయేశ్వరునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ అన్న సమారాధన జరిగింది. బెండపూడి, పిఇ చిన్నయ్యపాలెం శివాలయాల్లో పూజలు జరిగాయి.

శంఖవరం: మండలంలో వేళంగి ధారక్షేత్రం, శంఖవరం మల్లేశ్వరస్వామి దేవస్థానం, కత్తిపూడి శివాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. రోజంతా భక్తులు తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆలయ కమిటీలు తగు ఏర్పాట్లు చేశాయి.

గండేపల్లి: గండేపల్లి, నీలాద్రిరావుపేట, ఉప్పలపాడు శివాలయాల్లో తెల్లవారుజామున నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాల్లో పాల్గొన్నారు. గండేపల్లి శివాలయం వద్ద లక్ష దీపార్చన, సత్యనారాయణ కల్యాణం జరిగాయి.

ప్రత్తిపాడు: రాచపల్లి గ్రామంలో అపీత కుంచాబ సమేత అరుణాచలేశ్వరునికి అన్నాభిషేకం నిర్వహించారు. గోపూడ, విఘ్నేశ్వర పూజ, ఏకవారరుద్రాభిషేకాలు అనంతరం ఈ అన్నాభిషేకాన్ని నిర్వహించారు. మృత్యుంజయ హోమం, ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. అలాగే ధర్మవరం, ప్రత్తిపాడు, ఒమ్మంగి, గజ్జెనపూడి, ఎరకంపాలెంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



శంఖవరం శివాలయంలో భక్తులు



తుని మండలం తేటగుంట ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

ఉప్పలపాడులో అధికారుల పరిశీలన

గండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.64లక్షలతో నిర్మించిన పైపులైను సీసీ డ్రైనేలో వేశారని దీని వల్ల నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అదే గ్రామానికి చెందిన మేడిబోయిన శ్రీను, సత్తి సోమరాజు, అడబాల సత్యనారాయణమూర్తి, అంకం ఓం కృష్ణ, నూకతట్టు వెంకటరమణ పలువురు కలెక్టరేట్, ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ఎం.ఎస్‌స్వామి, ఎంపీడీవో నాతి బుజ్జి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. సీసీ డ్రైనేజీలో పైపు లైన్, నీటిని పరిశీలించామని పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ అప్పలరాజు, కార్యదర్శి తరంగణి ఉన్నారు.

టీడీపీ నేతల నిరసన

శంఖవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో టీడీపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుకిరువైపులా ఆక్రమణలు ఎక్కువగా ఉండడంతో జాతీయ రహదారిపై బస్సులు, వాహనాలకు ఇబ్బందిగా ఉంటుందని వాహనదారుల ఫిర్యాదులపై అధికారులు ఆక్రమణలు తొలగిస్తున్నారు. టీడీపీ నేత వెన్నా ఈశ్వరుడు ఆధ్వర్యంలో దుకాణందారులు రోడ్డుపై బైఠాయించారు. ఒక్కసారిగా పూర్తిస్థాయిలో తొలగిస్తే ఇబ్బందులు పడతామని, రోడ్డుపైకి రాకుండా జాగ్రత్తలు పడతామని తెలపడంతో హైవే అధికారులు వెనుదిరిగారు. దుకాణందారులు, టీడీపీ కార్యకర్తలు తదితరులున్నారు.

వెండి శఠగోపం బహూకరణ

జగ్గంపేట, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలో సీతానగరంలో నిర్మిస్తున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి రావులమ్మ తల్లి గుడి ధర్మకర్త జీను పెద్ద రాంబాబు, వారి కుమారుడు జీను వెంకటేష్ వెండి శఠగోపం బహూకరించారు. ఆలయకమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 17న విగ్రహ ప్రతిష్ఠ ఆలయ ప్రారంభోత్సవం, భారీ అన్న సమారాధన జరుగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు సింగం ఫణీంద్ర, ఆముదాల రాజు, చుండ్రు సాయి వీరకృష్ణ, సందళ్ళ శివసాయి కుమార్ తదితరులు ఉన్నారు.

గౌరీదేవి ఉత్సవాలు

కిర్లంపూడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లంగి రామాలయంలో గౌరీదేవి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం రామాలయం వద్ద నుంచి రాముడు, లక్ష్మణుడు, సీత, ఆంజనేయులు సుమారు 108 దేవతామూర్తుల వేషధారణలు నిర్వహించారు. చిల్లంగి, కిర్లంపూడి, జగపతినగరం మీదుగా సంబరం సాగింది.

'ఆదిత్య'లో అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు





ఆదిత్య ప్రాంగణంలో పోటీలు ప్రారంభిస్తున్న అతిథులు, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో ఆదిత్య ప్రాంగణంలో కాకినాడ జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ మెన్ అండ్ విమెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2023-24 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ఆదిత్య కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జేఎన్టీయూకే స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ డాక్టర్ జి.శ్యాంకుమార్, అంతర్జాతీయ అథ్లెటిక్ పి.వరప్రసాద్, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ నాయకులు నూకరాజు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే వివిధ పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి విజేతగా నిలవాలన్నారు. ఆదిత్యలో వరుసగా పదోసారి ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రవి తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో వివిద పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలో గల వివిధ కళాశాలలకు చెందిన 350మంది పైగా క్రీడాకారులు పాల్గొంటారని ఆయన చెప్పారు. సోమవారం జరిగిన పోటీల్లో విజేతలకు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు.

ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న లిబరేషన్ కార్యకర్తలు

పోతులూరులో లిబరేషన్ ప్రదర్శన

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 4న విజయవాడలో నిర్వహించే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పోతులూరులో సోమవారం సీపీఐఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి, మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు, కామరాజు, సుబ్బారావు, మునలయ్య, ఏసుబాబు, కొండలరావు, లచ్చబాబు, అప్పారావు, రాంబాబు ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ

జగ్గంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టీవీఎస్ రంగారావు అధ్యక్షతన జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు ఆధ్వర్యంలో మహిళల భద్రత, రక్షణపై విద్యార్థులకు మహిళా పోలీస్, మహిళారక్షక్ బృందాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, జగ్గంపేట ఎం ఈవో2 సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు ఏ విధమైన సహకారం కావాల్సిన 100 లేదా సీఐ 94407 96529, ఎస్ఐ 94407 96569కు ఫోన్ చేసి మహిళా రక్షక్ సహకారం, సేవలు పొందవచ్చని తెలియజేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఉస్మారా బేగం, ఉపాధ్యాయులు ఎన్.కృష్ణమోహన్, వీ.మూర్తి ఉన్నారు.

ఆకట్టుకున్న 'సారంగధర'



ధర్మవరంలో ప్రదర్శనలో కళాకారులు

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో సోమవారం కళాకారులు నిర్వహించిన సారంగధర నాటక కళాప్రదర్శన ఆకట్టుకుంది. సారంగధర విలువల కోసం తల్లి కొడుకుల అనుబంధం ఎలా ఉండాలంటే ఇతివృత్తంగా కళాప్రదర్శన సాగింది. సారంగధరగా తుపాటి పాదాలరావు, జువుక్‌గా తూపాటి సత్తిరాజు, మహారాణిగా రాచపల్లి సత్తిబాబు, బొమ్మిడాల రమణ, పక్కుర్తి కృష్ణ నటించారు.



కేక్ కట్ చేస్తున్న జెన్‌కో సీఈ వాసుదేవరావు, ఎస్ఈ చిన్నకామేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది

యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

మోతుగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం మోతుగూడెంలో ఘనంగా నిర్వహించారు. జెన్‌కో సీఈ వాసుదేవరావు ముఖ్య అతిథిగా హాజరు కాగా అధికారులు, సిబ్బంది కేక్ కట్ చేశారు. జెన్‌కో ఎస్ఈ చిన్న కామేశ్వరరావు, బ్యాంకు మేనేజరు విత్తనాల సత్యనారాయణ, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జానీ

14న వలంటీర్ల జిల్లా స్థాయి సదస్సు

చింతూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న రంపచోడవరంలో జరిగే వలంటీర్ల జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని వలంటీర్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొడియం జానీ కోరారు. సోమవారం చింతూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10వేలు వేతనం చెల్లించి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వలంటీర్లతో కలిసి అసెంబ్లీ ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వలంటీర్ యూనియన్ నాయకులు కలుముల మహేష్, సోడి దుర్గారావు, వనరాజు, కట్టం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై ఖండన

రంపచోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మారేడుమిల్లి మండలం మద్దలూరు గ్రామంలో స్థలం వివాదంలో తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయించడంపై బాలు అక్కిన ఖండించారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు.

వరుణ్‌తేజ్‌కు ఘన స్వాగతం



వరుణ్‌తేజ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

జగ్గంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు వరుణ్‌తేజ్‌కు సోమవారం జగ్గంపేటలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఘన స్వాగతం పలికారు. మట్కా సినిమా ప్రమోషన్‌లో భాగంగా వైజాగ్ నుంచి రాజమండ్రి వెళ్లే దారిలో జగ్గంపేట జాతీయ రహదారిపై తుమ్మలపల్లి రమేష్, తుమ్మలపల్లి సాయి, గుణశేఖర్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. వీరాంజనేయ ఫిలిమ్స్ అధినేత కొత్త చిన వీరభద్రరావు, థియేటర్స్ సిబ్బంది స్వాగతం పలికారు. జనసేన నాయకులు సూరంపాలెం బాలు, జగ్గంపేట ఐటీ కో ఆర్డినేటర్ ఆరిగె రాజేష్, పాలెం బాబి, సూరపురెడ్డి నరేష్, రామిశెట్టి రాజు, ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మొగిలి గంగాధర్, రాజనాల శ్రీను,మాదారపు వీరబాబు పాల్గొన్నారు.

'శ్రీ ప్రకాష్' విద్యార్థుల ప్రతిభ

తునిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఈనెల 9, 10న విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో 8వ తరగతికి చెందిన ఎస్.కిరణ్, 9వ తరగతి కి చెందిన ఎం.సాత్విక్, 10వ తరగతికి చెంది సాయిశ్రమణ జయదీప్ ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం సాధించారు. వారిని ప్రిన్సిపాల్ ఎంవీఎస్ మూర్తి, విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్, టీచర్లు అభినందించారు.

పేదలకు భోజనాలు

జగ్గంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం జగ్గంపేటకు చెందిన కెంగం రమణ, కెంగం రామకృష్ణ సోదరులు ఆర్థిక సాయంతో పేదలకు ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, బుర్రి సత్తిబాబు, కెంగం రామకృష్ణ, వేములకొండ జోగారావు, మారిశెట్టి గంగ, బద్ది సురేష్, కోడూరి రమేష్, ప్రేమస్వరూప్ బుజ్జి, పంపనబోయిన అప్పాజీ, దార్ల నానాజీ, పుర్రె వీరబాబు, గొర్రెల వీరబాబు, వానశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తేటగుంటలో పడిపూజ

తునిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తేటగుంట అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామివారికి పడిపూజ మహోత్సవం జరిగింది. అయ్యప్ప సేవా సంఘం సభ్యులతో ఏటా నిర్వహించే ఈ కార్యక్రమం కార్తీక సోమవారం పురస్కరించుకుని స్వామి వారికి పడిపూజతో పాటుగా పంచామృత అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున అయ్యప్పస్వాములు, శివస్వాములు పూజలు ఆచరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్రహ్మంగారి ఆలయం వద్ద వప్పుల సంతోష్ దంపతులు పీఠలపై కూర్చున్నారు. వేద పండితుడు జగదీశ్వర శర్మ పూజలు నిర్వహించారు. గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి శాస్త్రోక్తంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా దినోత్సవం

తొండంగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తొలి జాతీయ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలను ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆర్, జగదీష్ ప్రకాష్, పివి కృష్ణారావు, శ్రీనుబాబు, వెంకటేశులు, పి వి.కృష్ణారావు, టి.రాము, రాజశేఖర్ ఉన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

గండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి పాతూరుకాలనీలో గౌరీదేవి సంబరాల్లో 5రోజులపాటు నిర్వహించిన కబడ్డీ పోటీలు ముగిశాయి. సుమారు 25 జట్లకు పైగా తలపడ్డాయి. ప్రథమస్థానంలో జగ్గంపేట మండలం మల్లిశాల జట్టు, ద్వితీయ స్థానం మల్లేపల్లి, తృతీయస్థానం రాచపల్లి జట్టు సాధించాయి. దిడ్డి చిన్నశ్రీను, దొరబాబు పాల్గొన్నారు.



స్థానికులకు రగ్గులు పంపిణీ చేస్తున్న సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ శివనారాయణ

ఒడియా క్యాంపులో 'మైత్రి' సదస్సు

మోతుగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఒడియా క్యాంపు గ్రామంలో మోతుగూడెం పోలీసులు సోమవారం మైత్రి సదస్సు నిర్వహించారు. వచ్చిన గిరిజనులకు చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్, మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసు కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, మహిళల రక్షణ, బాల్యవివాహాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. పిల్లలను పాఠశాలల్లో చేరిస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. స్థానికులకు చలి నుంచి రక్షణ నిమిత్తం రగ్గులు పంపిణీ చేశారు.